క్లుప్తంగా

డ్యాన్స్ మాస్టర్‌కు భారత్ బుక్ ఆఫ్ అవార్డు



రవీంద్ర భారతిలో అవార్డు అందుకుంటున్న ధర్మవరం డ్యాన్స్ మాస్టర్ లోకేష్

ధర్మవరం అర్బన్: ధర్మవరం డ్యాన్స్ మాస్టర్‌కు భారత్ బుక్ ఆఫ్ అవార్డు దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో భారత్ ఆర్ట్స్ సంస్థ వారు బాలోత్సవ్ (చిల్డ్రన్స్ డే) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ధర్మవరం రాకింగ్ స్టార్ డ్యాన్స్ అకాడమీ మాస్టర్ లోకేష్ శిష్య బృందం డ్యాన్స్‌లతో అదరగొట్టారు. ధర్మవరం కళాకారులు సోని, తన్మయ్, శ్రావణి, వందన, శిరీష్, దిలీప్, కావ్య, సునిల్‌లు నాట్య ప్రదర్శనతో చేసి ఆకట్టుకున్నారు. అనంతరం డ్యాన్స్ మాస్టర్ లోకేష్‌కు భారత్ బుక్ ఆఫ్ అవార్డును సీనియర్ నటి దివ్యవాణి చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. తనకు సహకరిస్తున్న స్నేహితుడు, డ్యాన్స్ మాస్టర్ అస్లాంకు కృతజ్ఞతలు తెలిపారు. నాట్యంపై ఆసక్తి ఉన్న పేద పిల్లలకు ఉచితంగా డ్యాన్స్ నేర్పిస్తానని తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



డ్రైనేజీని శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

పుట్టపర్తి టౌన్: సత్యసాయి బాబా జయంత్యుత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ప్రహల్లాద తెలిపారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. డ్రైనేజీ, ఇతర సమస్యలపై ఆరా తీశారు. 6వ వార్డు వివేకానంద రోడ్డులో పొంగి పొర్లుతున్న మురుగును చూసి, అసహనం వ్యక్తం చేశారు. వెంటనే డ్రైనేజీకి మరమ్మతులు చేయించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ఈనెల 18వ తేదీ నుంచి సత్యసాయి జయంత్యుత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. దేశ విదేశాల నుంచి భక్తులు అధి సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందని వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి టౌన్: వడ్డెర్లకు అన్ని విధాలా ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత వడ్డె ఓబన్నను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు. అంతకు ముందు ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. డప్పులు, వాయిద్యాల నడుమ వడ్డె ఓబన్న విగ్రహం వరకూ భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వడ్డెర్ల సంఘం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, నాయకులు పి.వి.రమణ, వెంకటేష్, రమణ, సంపంగి గోవర్ధన్, వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.

పైపులైన్ ఏర్పాటు

నల్లచెరువు: మండల పరిధిలోని బాలేపల్లి తండాలో పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో మంచినీటితో పాటూ మురుగు నీరు కలిసి రోడ్డుపై ప్రవహించేది. నీరు కలుషితం అవుతున్నాయని ఇటీవల సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గ్రామంలో పర్యటించి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. హామీ ప్రకారం ఆదివారం గ్రామంలో రోడ్డుపై ఉన్న ఇనుప పైపులైన్‌కు లీకేజీలను గుర్తించారు. వాటిని సరిచేసి కాలువలు తవ్వి పైప్‌లను భూమిలో పాతారు. కార్యక్రమంలో సర్పంచ్ సోనాలమ్మ, పంచాయతీ కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై నేడు ధర్నా

కనగానపల్లి: రైతు సమస్యల పరిష్కారం కోసం సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాలో రైతు సంఘం నాయకులతో పాటు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇబ్బంది పడుతూ.. సేవలందిస్తూ

- పెడపల్లిలో చిన్న భవనంలో విధులు నిర్వర్తిస్తున్న రెండు సచివాలయాల సిబ్బంది
- నిరుపయోగంగా బత్తలపల్లి సచివాలయ భవనం
- పాత సచివాలయ భవనంలో సతమతం అవుతున్న సిబ్బంది
- సేవల కోసం నాలుగు కిలోమీటర్లు ప్రయాణిస్తున్న ప్రజలు



రెండు సచివాలయాల సిబ్బంది విధులు నిర్వహిస్తున్న భవనం



నిరుపయోగంగా ఉన్న బత్తలపల్లి సచివాలయ భవనం

పుట్టపర్తి అర్బన్: నూతన సచివాలయాన్ని వినియోగించకుండా రెండు సచివాలయాల సిబ్బంది ఒక చిన్న భవనంలో ఇబ్బందులు పడుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. పుట్టపర్తి మండలంలో అతి పెద్ద పంచాయతీ పెడపల్లి. సుమారు 10 వేల మంది జనాభా ఉన్న గ్రామంలో రెండు సచివాలయాలు ఉన్నాయి. ఒకటి పెడపల్లి, రెండవది హ్యాబిటేషన్ గ్రామం బత్తలపల్లి. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా అన్ని సేవలను ప్రజలకు సకాలంలో గడప వద్దే అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఇందులో ఒక్కో సచివాలయానికి 11 మందిని సిబ్బందిని నియమించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించే విధంగా వారికి అధికారాలు ఇచ్చారు. అంతటితో ఆగకుండా సిబ్బందికి అవసరమైన సచివాలయ భవనాలను అధునాతన హంగులతో నిర్మించారు. ఒక్కో భవనానికి సుమారు రూ.40 లక్షలు వెచ్చించారు. అందులో ఒక సమావేశానికి అవసరమైన హాల్, కంప్యూటర్ గది, పంచాయతీ సెక్రెటరీకి ప్రత్యేక గది, అందులో పని చేసే సిబ్బంది అందరికీ ప్రత్యేక గదులు నిర్మించారు. ప్రజలకు సేవలందించడానికి తగిన విధంగా భవనాలు నిర్మించారు.

పెడపల్లిలో ఆగిన నిర్మాణ పనులు

పెడపల్లిలో ఉన్న రెండు సచివాలయాలకు రెండు భవనాల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో మొదట బత్తలపల్లి సచివాలయ భవనం పూర్తి చేసి అప్పటి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ప్రారంభించారు. రెండవది పెడపల్లిలో సచివాలయ భవనం నిర్మాణ దశలోనే ఆగిపోయింది. దీంతో రెండు సచివాలయాల సిబ్బంది గతంలో ఉన్న పాత గ్రామ పంచాయతీ భవనంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. పాత భవనంలో ఒక చిన్న హాల్, పక్కన రెండు చిన్న గదులు ఉన్నాయి. అందులోనే సిబ్బంది ఇబ్బంది పడుతూ ప్రజలకు సేవలందిస్తున్నారు. బత్తలపల్లి సచివాలయం పక్కనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించగా వైద్య సిబ్బంది అక్కడే ఉంటూ సేవలందిస్తున్నారు. ఇక సచివాలయ సిబ్బంది మాత్రం అక్కడకు వెళ్లకుండా కాలయాపన చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. బత్తలపల్లి సచివాలయం కింద బత్తలపల్లి, గువ్వలగుట్టపల్లి, పెడపల్లి పెద్ద తండా ఉన్నాయి. వారంతా సచివాలయం వద్దకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరంతా పెడపల్లి సచివాలయానికి రావాలంటే సుమారు నాలుగు కిలోమీటర్లు దూరం రావాల్సి ఉంటుంది.

మందుబాబులకు అడ్డాగా నూతన సచివాలయం

ఇటీవల ప్రభుత్వం ఇష్టారాజ్యంగా మద్యం షాపులను పెంచేసింది. అనధికారికంగా బెల్ట్ షాపుల్లో మద్యం లభిస్తుండటంతో మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నారు. గ్రామ చివరన సచివాలయం ఉండటంతో మందుబాబులు రాత్రిళ్లు అయితే అక్కడ చేరి మందు సేవిస్తూ కాలం గడుపుతున్నారు. అటుగా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని మహిళలు చెబుతున్నారు. ఈ విషయంపై గ్రామ పెద్దలు, రూరల్ పోలీసులు, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్నారు. మరికొద్ది రోజులు గడిస్తే సచివాలయంలో ఉన్న విద్యుత్ వైర్లు, పైప్ లైన్, లైట్లు, ఇతర పరికరాలు కూడా చోరీ అయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది

మా గ్రామంలో సచివాలయం నిర్మించారనే సంతోషం లేకుండా చేశారు. అన్ని సేవలకూ నాలుగు కిలోమీటర్ల దూరంలోని పెడపల్లికే వెళ్లాలి. ఈ విషయంపై అధికారులను అడుగుతున్నా పట్టించుకోవడం లేదు. వృద్ధులు, మహిళలు ద్విచక్ర వాహనాలు లేని వారు పెడపల్లికి వెళ్లి రావడానికి సుమారు రూ.20 బస్సు చార్జీ అవుతోంది. ఇప్పటికైనా భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి.

– గోవింద నాయక్, బత్తలపల్లి తండా

వినియోగంలోకి తీసుకొస్తాం

బత్తలపల్లిలో నిర్మించిన నూతన సచివాలయంలో నీటి సమస్య ఉంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో నీటి సమస్యను పరిష్కరిస్తాం. ప్రజల సౌకర్యార్థం నూతన సచివాలయ భవనాన్ని వినియోగంలోకి తీసుకొస్తాం. సచివాలయం మందుబాబులకు అడ్డాగా మారిందని తన దృష్టికి వచ్చింది. నీటి వసతి కల్పించాలని పంచాయతీ సెక్రెటరీకి ఆదేశాలు జారీ చేస్తాం. సిబ్బంది ఈ సచివాలయం నుంచే సేవలందించేలా చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వర రెడ్డి, ఎంపీడీఓ, పుట్టపర్తి

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ నాగస్వామి, ఏఎస్‌ఐ వన్నప్పను సన్మానించిన దృశ్యం

తాడిమర్రి: ప్రజలకు ఉత్తమ సేవలు అందించినప్పుడే గుర్తింపు లభిస్తుందని తాడిమర్రి ఎస్‌ఐ కృష్ణవేణి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ నాగస్వామి, ఏఎస్‌ఐ వన్నప్పకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులకు బదిలీలు సర్వసాధారణమన్నారు. అయితే ఎక్కడైనా ప్రజలకు మంచి చేస్తే మనకు సంతృప్తి లభిస్తుందన్నారు. నాగస్వామి వజ్రకరూరుకు, ఏఎస్‌ఐ వన్నప్ప రామగిరి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్నారన్నారు. అక్కడ కూడా బాగా విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. బదిలీపై వెళ్తున్న అధికారులు మాట్లాడుతూ.. మండలంలో ప్రజలకు సంతృప్తిగానే సేవలు అందించామన్నారు. అదేస్థాయిలో ప్రజలు కూడా తమకు సహకరించారన్నారు. ఇక్కడి ప్రజలను మరచిపోలేమన్నారు. అనంతరం ఎస్‌ఐ నాగస్వామి, ఏఎస్‌ఐ వన్నప్పకు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ రెడ్డి, గణేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన ఆలయాలపై సాహిత్యం రావాలి



ప్రాచీన ఆలయాల వైభోగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చరిత్రకారుడు మైనాస్వామి

పుట్టపర్తి టౌన్: ప్రాచీన ఆలయాల విశిష్టతను తెలిపేందుకు మరింత సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకుని రావాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం పట్టణంలోని సాయి ఆరాయంలో చరిత్రకారుడు మైనాస్వామి రాసిన ప్రాచీన ఆలయాల వైభోగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మైనాస్వామి మాట్లాడుతూ.. బృహత్తర పర్యాటక వలయం అభివృద్ధిలో భాగంగా తాను ప్రాచీన ఆలయాల వైభోగం పుస్తకాన్ని రాసినట్లు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో హేమావతి నుంచి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి వరకూ ఉన్న ప్రాచీన ఆలయాలపై రాష్ట్ర ముఖ్యమంత్రికి ఒక నివేదిక సమర్పించినట్లు వెల్లడించారు. నివేదిక ఆధారంగా అభివృద్ధి జరిగితే ఆయా ప్రాంతాల రూపురేఖలు మారుతాయని పేర్కొన్నారు. ఆ ప్రాంతాల్లో ఉపాధితో పాటు ఆదాయం వస్తుందని వివరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రాచీనాలయాల వైభోగం గురించి తెలుసుకోవాలంటే భావితరాలలకు చెప్పాలంటే ఇటువంటి పుస్తకాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. ప్రాచీన ఆలయాలు సందర్శించడం ద్వారా మనో వికాసం కలగడమే కాకుండా ఆచార సాంప్రదాయాలు పత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రాచీన సంస్కృతికి పట్టుకొమ్మలుగా నిలిచిన ప్రాచీన ఆలయాల గురించి మరింత ప్రచారం చేయాలని సూచించారు. అలాగే ఆలయాల భూములు కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వావిద్యాలయం ఆచార్యలు డాక్టర్ గండ్లూరు బాలసుబ్రహ్మణ్యం, కదిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, వీహెచ్‌పీ నాయకుడు డాక్టర్ వేదవ్యాస్, బీజేపీ నాయకులు కొండమ రాజు, కౌన్సిలర్ రత్నప్ప చౌదరి, పట్టణ ప్రణాళిక మాజీ అధ్యక్షుడు కోటా సత్యం, సామకోటి ఆదినారాయణ, ఉపాధ్యాయులు జగదీష్, సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వంగంపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

తనకల్లు: స్థానిక సివిల్ సప్లయ్ స్టాక్ పాయింట్‌లో హమాలీగా పని చేస్తున్న నరసింహులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కుటుంబానికి రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మండల కన్వీనర్ వేమన్న, రైతు సంఘం నాయకులు శివన్న, నాయకులు కొండయ్య, శ్రీరాములు, గంగాధర్, కిష్టప్ప, ఫక్రుద్దీన్, శివ, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, వెంకటరాయుడు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు సాయం

తనకల్లు: మండలంలోని రత్నేనాయక్ తండాకు చెందిన యశోద అనే మహిళ కొంతకాలంగా మానసికారోగ్యంతో బాధపడుతోంది. ఆర్థికస్థితి సరిగా లేకపోవడంతో సరైన వైద్యం చేయించుకునేందుకు ఇబ్బంది పడుతోంది. ఆదివారం యశోద పరిస్థితి తెలుసుకున్న వందేమాతరం టీం సభ్యుడు కొండ్ల రమేష్ స్పందించారు. వైద్య చికిత్సల కోసం రూ.11,500 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వందేమాతరం టీం సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు అన్నదానం



భోజనం చేస్తున్న అయ్యప్ప స్వాములు

ఓడీచెరువు: మండల కేంద్రానికి సమీపంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలోని మాలధారులకు ఆదివారం అన్నదానం చేశారు. కార్తీక మాసంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం పుణ్యకార్యం. కఠిన దీక్షతో ఉపవాసం ఉండే అయ్యప్పలకు భోజన వసతి కల్పించడం అదృష్టంగా భావిస్తున్నామని ఓడీచెరువుకు చెందిన దాతలు సింగప్ప, సరోజమ్మ తెలిపారు. గురుస్వామి ఆంజనేయులు అయ్యప్ప స్వామికి పూజలు చేసి, ప్రసాదం అందజేశారు.

నిరుపేదల జీవితాల్లో వెలుగులు



డాక్టర్ రాధికను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరంతో నిరుపేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్ గుప్తా తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటిచూపు తగ్గిన వారికి బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరంలో 145 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 96 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. శిబిరం దాతలుగా గోరకాటి పెద్దారెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గోరకాటి ప్రమీలమ్మ, గోరకాటి రఘునాథ్‌రెడ్డి వ్యవహరించారు. అనంతరం క్యాంప్ దాతలతోపాటు వైద్యురాలు రాధికను రోటరీక్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో క్యాంప్ చైర్మన్ గట్టు హరినాథ్, రోటరీక్లబ్ జిల్లా పల్స్‌పోలియో చైర్మన్ రత్నశేఖర్ రెడ్డి, సభ్యులు రమేష్ బాబు, శివయ్య, కొండయ్య, మనోహర్‌గుప్తా, శ్రీనివాసరెడ్డి, బండారు వెంకటాచలం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరం



కరపత్రాలు విడుదల చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: రహదారి మానసిక బాధితులను పునరావాసానికి తరలించేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేశారు. పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మనో బంధు సేవల కింద రహదారి మానసిక బాధితులకు పునరావాసం కల్పించడానికి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములు చేయాలని సూచించారు. ధర్మవరంలోని రహదారి మానసిక బాధితులను కడప నగరంలోని ప్రభుత్వ మానసిక ఆసుపత్రికి పంపించాలని తెలిపారు. డిసెంబర్ 3వ తేదీన ధర్మవరంలోని పోలా ఫంక్షన్ హాల్‌లో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మనోబంధు కవిత శీర్షిక ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. ఈ నెల 14వ తేదీన రాయచోటిలో జరిగే స్వచ్ఛంద సంస్థల సమావేశంలో మనోబంధు సేవలపై చర్చించాలన్నారు. కడప నగరంలో డిసెంబర్ 8వ తేదీన సామాజిక చైతన్య సంస్థ ఆధ్వర్యంలో జరిగే ప్రజా సంఘాల స్వచ్ఛంద సంస్థల నేషనల్ వర్క్‌షాప్‌లో చర్చించాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైద్యుడు సత్యనిర్ధారణ్, నరసింహులు, జిల్లా రచయితల సంఘం సభ్యులు జయసింహ, వేణుగోపాల్, రమేష్, జయరామిరెడ్డి, మనోబంధు కన్వీనర్ శ్రీరాములు, రోటరీక్లబ్ సభ్యులు నరేంద్రరెడ్డి, గుంతకల్లు రాధా మహిళా మండలి సభ్యులు తులసీబాయి, అనంతపురం పాస్ స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు రామప్ప, నార్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు



స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

చెన్నేకొత్తపల్లి: సర్కిల్ పరిధిలోని రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో కర్ణాటక మద్యం విక్రయించరాదని చెన్నేకొత్తపల్లి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఫరూక్ అజామ్ హెచ్చరించారు. సర్కిల్ పరిధిలోని పలు మండలాల్లో ఆదివారం దాడులు నిర్వహించారు. చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెలలో ఓబులమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకుని, ఆమె వద్ద నుంచి 60 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. అలాగే రామగిరి మండలం ముత్యాలమ్మపల్లిలో ముత్యాలన్నను అదుపులోకి తీసుకుని, 54 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ, ఎస్‌ఐ చెప్పారు. దాడుల్లో ఎస్‌ఐ శివప్రసాద్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు శంకర్‌నాయక్, రంగనాయకులు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో చేర్పించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

నల్లచెరువు: 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి ఓటరు జాబితాలో చేర్పించాలని తహసీల్దార్ రవికుమార్ ఆదేశించారు. ఆదివారం మండల పరిధిలోని తలమర్ల వాండ్లపల్లి పంచాయతీల్లోని సంజీవపల్లి, పెద్దయల్లంపల్లితో పాటూ నల్లచెరువుని పోలింగ్ బూత్‌లను పరిశీంచారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్ఓ రామచంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ హనుమంతు వీఆర్ఏలు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని బుక్కపట్నం తహసీల్దార్ షాబుద్దీన్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. బుక్కపట్నంలో జరిగిన ఓటర్ నమోదు కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



రామగిరి: పేరూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కె.సి.మల్లికార్జున, మనీష్‌కుమార్ ఆదివారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మండలంలోని పరిస్థితుల గురించి వివరించారు.

12 నుంచి రెవెన్యూ గ్రామసభలు

ధర్మవరం రూరల్: ఈనెల 12 నుంచి 29వ తేదీ వరకు మండల పరిధిలోని గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్ బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భూ సమస్యలు, రస్తా సమస్యలు, వెబ్ ల్యాండ్, ఇతరత్రా రెవెన్యూ సంబంధిత సమస్యలపై రైతులు అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు. 12వ తేదీన దర్శనమల, 13న నేలకోట, 14న మల్లాకాలువ, 15న ఏలుకుంట్ల, బుడ్డారెడ్డిపల్లి, 19న రావులచెరువు, 20న తుమ్మల, సుబ్బరావుపేట, 21న పోతులనాగేపల్లి, 22న గొట్లూరు, 26న చిగిచెర్ల, 27న రేగాటిపల్లి, 28న కునుతూరు, 29న ధర్మవరంలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రికెట్ సబ్ సెంటర్ అభివృద్ధికి విరాళం



ముబారక్‌కు చెక్కు అందజేస్తున్న హుస్సేన్

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ సబ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. క్రికెట్ సబ్ సెంటర్ అభివృద్ధికి కర్నూలు జిల్లా డోన్ పట్టణానికి చెందిన వ్యాపారి హుస్సేన్ ఆదివారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కురూపంలో కోశాధికారి ముబారక్‌కు అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారుల తల్లిదండ్రులు సుధాకర్, నాగరాజు, నరసింహమూర్తి, హరిప్రసాద్ రెడ్డి, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఓ లాడ్జిలో ఆదివారం పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.59 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

తాడిమర్రి: తురకవారిపల్లి సమీపంలోని ముళ్లపొదల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.27,620 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కృష్ణవేణి తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అపూర్వ సమ్మేళనం



ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ధర్మవరం అర్బన్: అలనాటి పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరి వారు చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆదివారం పట్టణంలోని సంజయ్ నగర్‌లో ఉన్న బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో 2003–04 బ్యాచ్ పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా పాఠశాల ఆవరణలో ఒకచోట చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను పిలిచి శాలువాలతో సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలు, విద్యార్థి దశలో చేసిన అల్లరిని గుర్తు చేసుకుని మురిసిపోయారు. ఒకరికొకరు క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్, అలనాటి పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు రెడ్డి, పీఈటీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు సంజీవయ్య, శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు.